క్లుప్తంగా

జ్ఞాన సరస్వతి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు భీమనగర్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సంపత్ షిర్డీసాయి అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో పోలీసులు పైడిరాజు, సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మెట్ట దమయంతి, రత్నం, శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు తిక్కవానిపాలెం కాలనీలోని సంపత్ వినాయక పార్వతీ విశ్వేశ్వర ఆలయ 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు గరికిన పరసియ్య, అధ్యక్షుడు మేడ గుర్రప్ప వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్ని పార్టీల స్థానిక నాయకులు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మేడ గుర్రప్ప, కోలా చంటి, వానపిల్లి అప్పన్న, గనగల్ల శంకర్, సింగిపిల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నలుగురి అరెస్ట్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేపట్టిన వారికి గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురిని మూడో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురు ఏయూ సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. తమకు ఆనందపురానికి చెందిన సాయి, గోవింద్, తూర్పు గోదావరికి చెందిన సంతోష్, శ్రీకాకుళానికి చెందిన సతీష్ గంజాయిని సప్లయ్ చేసినట్లు సెక్యూరిటీ గార్డులు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన మూడో పట్టణ పోలీసులు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

సీతమ్మధార: ప్రభుత్వరంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగం, ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలు 681వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకుంటామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని హెచ్చరించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతం.. శ్రీనివాస కల్యాణం

- లోక కల్యాణార్థం నిర్వహణ
- మంత్రముగ్ధులను చేసిన నృత్య రూపకం


శ్రీనివాస కల్యాణ నృత్య రూపకంలో కళాకారులు


శ్రీనివాసుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతమ్మధార: లోక కల్యాణార్థం శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం టీపీటీ కాలనీలోని ద్రవిడ సంక్షేమ సంఘం, శ్రీలలిత నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీరంగనాథచార్యులు, శ్రీసుబ్రహ్మణ్యాచార్యులు నేతృత్వంలో నిర్వహించిన కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు ఉదయ్‌కుమార్ సారథ్యంలో జరిగిన అన్నమయ్య సంకీర్తన వైభవం ప్రత్యేకంగా నిలిచింది. హరినాథ బృందం ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పలువురు పాడిన సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ శ్రీనివాసుడి కల్యాణంలోని మధుర ఘట్టాలను తన వ్యాఖ్యానంతో ఆవిష్కరించారు.

ఘనంగా తిరువీధి మహోత్సవం : సీతమ్మధారలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నుంచి స్వామి వారి తిరువీధి మహోత్సవం ఘనంగా ప్రారంభించారు. లలితాదేవి కోలాటం, శ్రీగౌరీసాయి కోలాటం తదితర బృందాలు గోవింద నామస్మరణతో స్వామి వారి కల్యాణ వేదిక వరకు ఊరేగింపు సాగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ డా.జి.ఎస్.ఎన్.రాజు, ద్రవిడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.ఎ.ఎన్.మూర్తి, కార్యదర్శి ఎస్.ఫణిస్వామి, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అధ్యక్షుడు ఎస్.కె.చంద్ర మౌళేశ్వరశర్మ, చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో స్ఫూర్తి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సీతమ్మధార: క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యను అందిస్తూ ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లేందుకు దోహదపడుతున్న ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ యాజమాన్యం విద్యా రంగంలో స్ఫూర్తిగా నిలిచిందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఫెస్ట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. విశాఖలోని ప్రశాంతమైన వాతావరణంలో ఇంతచక్కటి పాఠశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక్కడి విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపుతూ ప్రత్యేకతను చాటుకుంటున్నారని కొనియాడారు. విద్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసానిస్తున్నారని చెప్పారు. గౌరవ అతిథి సినీ నటుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌కు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న చాలా మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్ దాన వీర శూర కర్ణ చిత్రంలోని డైలాగులు చెప్పి అందరినీ అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ మనోజ్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఏ రంగంలోనైనా ముందుకు దూసుకుపోగల సత్తా ఉన్న వాళ్లని కొనియాడారు. పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఫెస్ట్‌లో విద్యార్థులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సీబీఎస్‌ఎఫ్ విజయకుమార్, కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, స్కూల్ కరస్పాండెంట్ కె.జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం


ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు


హెల్మెట్ ధరించని వారికి అవగాహన కల్పిస్తున్న సభ్యులు

సీతంపేట: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలంటూ శ్రీసత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు అవగాహన కల్పించారు. ఆదివారం అక్కయ్యపాలెం హైవే కూడలిలో ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతను తెలియజేశారు. హైవే సిగ్నల్ పాయింట్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారి వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలును వివరించారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం నుంచి హెల్మెట్ రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐలు గంగాధర్, వి.వాణిశ్రీ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి మహిళా యూత్ కో ఆర్డినేటర్లు మల్లిక, సంగీత, నందిని, మహిళా యూత్ సభ్యులు, సమన్వయకర్త సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మార్గం అనుసరణీయం

- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆదివారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని విశాఖ జిల్లా సత్యసాయి సేవా సంస్థల శ్రీసాయి సౌధ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవ చేయడంలో భగవాన్ సత్య సాయి బాబా సూచించిన మార్గాన్ని అనుసరించాలన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న నానుడిని ఆచరణలో పెట్టి ఆయన జీవితాంతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి భక్తుడు సేవ చేసే మార్గంలో పయనించేటట్టు చేశారన్నారు. గ్రామాల అభ్యున్నతి కోసం అనేక దశాబ్దాలుగా కేవలం చర్చలు జరిగినప్పటికీ సత్యసాయి బాబా తను జన్మించిన పుట్టపర్తి కుగ్రామంలోనే ఉండి అక్కడే పెరిగి ఆ చిన్న గ్రామాన్ని ఒక టైటానిక్ గ్లోబల్ విలేజ్‌గా మార్చారన్నారు. బాబా దివ్య సంకల్పం మేరకు విద్య, వైద్యం, తాగునీరు చాలా ప్రభావితంగా అమలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడేపల్లి పతంజలి రచించిన 'శ్రీముత్తుస్వామి దీక్షితార్ కృతి సర్వస్వం' అనే పుస్తకాన్ని విజయేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు, ఆధ్యాత్మిక వేత్త వి.ఎస్.ఆర్.మూర్తి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.వి.ఎస్.ఎన్.నాయుడు, నగరంలోని వివిధ రంగాల ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు


నిత్య కల్యాణంలో ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు

నిత్య కల్యాణం.. వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం నిత్యకల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెదరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.


స్వర్ణపుష్పాలు

వైద్య సేవలు ఎంతో పవిత్రం


వైద్యులను సత్కరిస్తున్న సత్యదేవ్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం జగద్గురు పీఠం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంకితభావంతో సకాలంలో అందించే వైద్య సేవలు ఎంతో పవిత్రమైనవన్నారు. జగద్గురు పీఠం వంటి ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి శిబిరాల వల్ల రోగులకు వైద్యులపై మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు. సామాన్యుల చెంతకు వెళ్లి సేవలందించడం వల్ల వారికి వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్ హృద్రోగ నిపుణుడు డాక్టర్ ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ ఇటువంటి సంస్థల స్వచ్ఛంద సేవల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం జగద్గురు పీఠం డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ వైద్యులను ఘనంగా సత్కరించారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసారు. సెవెన్‌హిల్స్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అఖిల్ భరద్వాజ, మార్కెటింగ్ మేనేజర్ మింది లోకేష్ పాల్గొనగా.. జగద్గురు పీఠం సభ్యులు బి.ఉషాసుజన్, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, బి.వి.రమణారావులు సహాయ సహకారాలు అందించారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం


నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడి హోమగుండం వద్ద అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ భక్తిశ్రద్ధలతో చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానర్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి వారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో నరసింహరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ


దివ్య ప్రసాదాన్ని అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు, చర్చి ఫాదర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠాధిపతులు(ఆర్చి బిషప్) డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవాళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్ష రసాన్ని భుజించమని చెప్పారన్నారు. దివ్యపూజ బలిలో సత్ ప్రసాదంలో సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా నూతనంగా దివ్య సత్ ప్రసాదాన్ని సుమారు 130 మంది చిన్నారులు స్వీకరించారు. అనంతరం జ్ఞానాపురంలోని వడిచర్లవీధి, స్లీవ్‌గుర్తు మండపం, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.

రామరాజ్యంలో హాయిగా జీవిస్తున్నాం..

- సీఎం వైఎస్ జగన్ పరిపాలనపై ముస్లింల హర్షం
- తిరుగు లేని నాయకుడని కితాబు


కె.కె.రాజుతో మాట్లాడుతూ సీఎం జగన్ పాలనను ప్రశంసిస్తున్న స్థానిక ముస్లిం

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. రామరాజ్యంలో ఎంతో హాయిగా.. ప్రశాంతంగా బతుకుతున్నామని, వైఎస్ జగన్ తిరుగు లేని నాయకుడని కితాబిచ్చారు. జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ముస్లింలు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులందరికీ పింఛన్లు, విద్యార్థుల చదువులకు ట్యాబ్‌లు, గర్భిణులకు సౌకర్యాలు వంటి అనేక సంక్షేమ పథకాలు రామరాజ్యం లాంటి సీఎం జగన్ పరిపాలనలో దొరుకుతున్నాయన్నారు. ఆయనను ముస్లింలంతా ఎక్కువగా ఇష్టపడుతున్నారని, ఎన్నటికీ వదులుకోలేమన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌కే తమ ఓట్లు వేసి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకుంటామని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా.. జగనే సీఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అన్ని కుల, మతాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, ముస్లిం పెద్దలు, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మత సామరస్యంతో శాంతి స్థాపన


శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ సభ్యులు

సీతంపేట: ప్రపంచ శాంతిని కోరుతూ బి.వి.ఫౌండేషన్, ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ సర్వమతాలు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యపడుతుందన్నారు. దేశభక్తి, కులం, మతం అనేవి పూర్తిగా వ్యక్తిగత విషయాలని, వివిధ మతాలకు చెందిన వారు కలిసి జీవించడం మన భరతజాతి సంస్కృతిగా పేర్కొన్నారు. ఆ విధంగా మన దేశం ఇతర దేశాలకు మార్గదర్శకమన్నారు. ఈ దశలో ఐఏఆర్‌ఎఫ్ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించడం అభినందనీయమన్నారు. శాంతి సంఘం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సంస్థ ఆశయాలను తెలుపుతూ మానవ హక్కుల పరిరక్షణకు సహకారం, మతపరమైన సంస్థలతో కలిసి సర్వమత సమైక్యతకు సమాజ సేవకు విస్తృతంగా కృషి చేస్తోందన్నారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఎస్.ఆలీ బైగ్, హరగోపాల్, డానియల్ రాజు, రాజేంద్రజైన్, బి.చిన్నారావు. ఎస్.కె.సాహు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామికి పంచరత్న సేవ


పంచరత్న సేవలో పాల్గొన్న సంగీత విద్వాంసులు, విద్యార్థినులు

సీతంపేట: త్యాగరాజ స్వామి ఉత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం బీవీకే కళాశాలలో పంచరత్న సేవ జరిగింది. ముఖ్య అతిథి ప్రముఖ గాత్ర విద్వాంసుడు మల్లాది శ్రీరామ్‌ప్రసాద్ వాగ్గేయకారుల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం జగదానందకారక, దుడుకుగల, సాధించెనే, కనకనరుచిరా, ఎందరో మహానుభావులు పంచరత్న కృతులను సంగీత విద్వాంసులు, విద్యార్థులు కలిపి గానం చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు త్యాగరాజ కృతులను ఆలపించారు. నిష్టల కృష్ణవేణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్వాంసులు డాక్టర్ బి.కె.డి.ప్రసాద్, బండి శ్యామల, కాళీ ప్రసాద్, శంకరం పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


ఎన్‌జీజీవోస్ కాలనీలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: వార్డులోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సూచించారు. కార్పొరేటర్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ఎన్‌జీజీవోస్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పరిస్థితులు, కాలవలు, యూజీడీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో పేదల జీవితాలకు భరోసా కలిగిందన్నారు. సకాలంలో అన్ని పథకాలు అందుతున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్‌జీజీవోస్ కాలనీలో నిరంతర నీటి సరఫరా పథకంలో తవ్విన గోతులను పూడ్చిన మట్టి దిబ్బలు తొలగించకపోవడం వల్ల రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. భూగర్భ డ్రైనేజీ సమస్యను తక్షణం పరిష్కరించాలని అధికారులతో ఆయన మాట్లాడారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎలక్ట్రికల్, తాగునీటి సరఫరా సమస్యలను ఆయన దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు ఆదిరెడ్డి శ్రీను, చైతన్య, మౌళి, శంకర్, మున్నా, కిషోర్, బి.రాము, దేముడు, ఎన్‌జీజీవోస్ కాలనీ నాయకులు రామచంద్రరాజు, రాజారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు


రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐలు శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రౌడీ షీటర్ల దినచర్య, సత్ప్రవర్తన, వారిపై ఉన్న కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో అల్లర్లు చేయకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి వెళ్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, మంచిగా నడుచుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీ షీటర్లను పోలీస్ సిబ్బంది వాహనాలపై ఇళ్లకు అప్పగించి వచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధర్మేంద్ర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.